గుకేశే టైటిల్ ఫేవరేట్-డింగ్ లిరెన్

బుడాపెస్ట్: ఈ ఏడాది నవంబర్‌లో సింగపూర్ వేదికగా జరగాల్సి ఉన్న వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశే ఫేవరేట్ అని డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా) వ్యాఖ్యానించాడు. బుడాపెస్ట్ వేదికగా జరుగుతున్న 45వ చెస్ ఒలింపియాడ్ సందర్భంగా లిరెన్ మాట్లాడుతూ.. 'ఈ టోర్నీలో గుకేశ్ చాలా బాగా ఆడుతున్నాడు. త్వరలో జరుగనున్న వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లోనూ అతడే ఫేవరేట్. ప్రస్తుతం అతడు నాకంటే ఎక్కువ రేటింగ్ పాయింట్లు కలిగి ఉన్నాడు. గత ఏడాది కాలంగా నేను ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నా. కానీ రేటింగ్ వ్యత్యాసాన్ని తగ్గించేందుకు నేను శ్రమిస్తా' అని అన్నాడు.

అర్జున్ ఆరో గెలుపు

ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి వరుస విజయాల జోరు కొనసాగుతున్నది. అర్జున్ వరుసగా ఆరో విజయంతో సోమవారం జరిగిన పోరులో భారత్ 3-1తో రష్యాను ఓడించింది. టోర్నీలో ఇప్పటి వరకు ఓటమి ఎరుగని అర్జున్..సుగిరోవ్ సనాన్‌పై అద్భుత విజయం సాధించాడు. మహిళల విభాగంలో భారత్ 2.5-1.5తో అర్మేనియాపై గెలిచింది.

గ్లాస్గోలో కామన్వెల్త్ గేమ్స్?

లండన్: 2026లో జరుగనున్న కామన్వెల్త్ క్రీడలకు స్కాట్లాండ్ రాజధాని గ్లాస్గో ఆతిథ్యమివ్వనున్నట్టు సమాచారం. వాస్తవానికి వచ్చే ఎడిషన్ గేమ్స్‌కు విక్టోరియా(ఆస్ట్రేలియా) ఆతిథ్యమివ్వాల్సి ఉండగా వ్యయభారం కారణంగా ఆ నగరం తాము రేసు నుంచి వైదొలుగుతున్నామని గతేడాదే ప్రకటించింది. గ్లాస్గో ఇదివరకే 2014 లో ఈ క్రీడలను నిర్వహించింది.

హర్మన్‌ప్రీత్‌సింగ్ కెప్టెన్సీ షో

ఫైనల్‌కు భారత్

సెమీస్‌లో దక్షిణ కొరియాపై ఘన విజయం • తుదిపోరులో చైనాతో అమీతుమీ • పాక్‌కు చైనా షాక్

ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత జట్టు జైత్రయాత్ర అప్రతిహతంగా కొనసాగుతోంది. ఇప్పటిదాకా టోర్నీలో ఓటమన్నదే లేకుండా సెమీస్ చేరిన హర్మన్‌ప్రీత్ సింగ్ సేన.. సోమవారం జరిగిన రెండో సెమీస్‌లో దక్షిణ కొరియాను చిత్తుచేసి వరుసగా రెండోసారి, ఈ టోర్నీలో ఆరోసారి ఫైనల్ చేరింది. భారత హాకీ అభిమానులు ముద్దుగా పిలుచుకునే 'సర్పంచ్ సాబ్' (కెప్టెన్ హర్మన్‌ప్రీత్) రెండు గోల్స్‌తో అదరగొట్టగా ఉత్తమ్ సింగ్, జర్మన్‌ప్రీత్ సింగ్ తలా ఓ గోల్ కొట్టారు. ఈ విజయంతో భారత్ మంగళవారం జరిగే ఫైనల్‌లో ఆతిథ్య చైనాతో అమీతుమీ తేల్చుకోనుంది. తొలి సెమీస్‌లో చైనా.. మాజీ చాంపియన్ పాకిస్థాన్‌ను ఓడించి ఈ టోర్నీలో తొలిసారి ఫైనల్ చేరింది.

హులన్‌బుయిర్ (చైనా): భారత హాకీ జట్టు మరోసారి అద్భుత ప్రదర్శనతో ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లోకి ప్రవేశించింది. సోమవారం హులన్‌బుయిర్ వేదికగా జరిగిన రెండో సెమీస్‌లో భారత్.. 4-1తో దక్షిణ కొరియాను ఓడించి వరుసగా రెండోసారి ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. ఈ టోర్నీలో ఓటమన్నదే లేకుండా సాగుతున్న 'మెన్ ఇన్ బ్లూ'.. సెమీస్‌లో అదే దూకుడుతో ఆడింది. ఇది వరకే లీగ్ దశలో దక్షిణ కొరియాను చిత్తుచేసిన మన కుర్రాళ్లు సెమీస్‌లోనూ అదే ఫలితాన్ని పునరావృతం చేశారు. భారత్ తరపున ఉత్తమ్ సింగ్ (13వ నిమిషంలో), జర్మన్‌ప్రీత్ సింగ్ (32) తలా ఓ గోల్ చేయగా సారథి హర్మన్‌ప్రీత్ సింగ్ (19, 45) రెండు పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలిచి తిరుగులేని ఆధిక్యాన్ని అందించాడు. ప్రత్యర్థి జట్టు తరపున యంగ్ జిహున్ (33) ఒక్కడే గోల్ కొట్టగలిగాడు.

ఆది నుంచే దూకుడు..

ఆట ఆరంభం అయిన కొద్ది సేపటికే తొలి క్వార్టర్ 13వ నిమిషంలోనే అరిజీత్ సింగ్ అందించిన బంతిని నేరుగా గోల్ పోస్ట్‌లోకి పంపి భారత్‌కు తొలి గోల్ అందించాడు. తొలి క్వార్టర్ ముగిసిన వెంటనే కొరియాకు రెండు పెనాల్టీ కార్నర్ అవకాశాలు వచ్చినా వాటిని వినియోగించుకోవడంలో ఆ జట్టు సఫలీకృతం కాలేదు. కానీ 19వ నిమిషంలో భారత్‌కు వచ్చిన అవకాశాన్ని మాత్రం సర్పంచ్ సాబ్ వృథా చేయలేదు. ఆట అర్ధభాగం ముగిసేసరికి 2-0 ఆధిక్యంలో ఉన్న భారత్.. తర్వాత కూడా అదే జోరును కొనసాగించింది. 32వ నిమిషంలో ఔట్ సైడ్ సర్కిల్ నుంచి బంతిని తన అధీనంలో ఉంచుకుంటూ జర్మన్‌ప్రీత్ సూపర్ గోల్ కొట్టాడు. కానీ ఆ మరుసటి నిమిషానికే వచ్చిన పెనాల్టీ కార్నర్‌ను జిహున్ గోల్‌గా మలవడంతో కొరియా బోణీ కొట్టింది. 45వ నిమిషంలో హర్మన్‌ప్రీత్ మరో పెనాల్టీ కార్నర్ గోల్ సాధించాడు. ఈ టోర్నీలో అతడికి ఇది 7వ గోల్. ప్రత్యర్థి గోల్ పోస్ట్‌పైకి దండెత్తడంతో పాటు కొరియన్ల గోల్ ప్రయత్నాలను అడ్డుకోవడంలో మన డిఫెన్స్ శ్రేణి విజయవంతమైంది.

పాక్‌కు షాక్..

తొలి సెమీస్‌లో చైనా.. మాజీ చాంపియన్ పాకిస్థాన్‌కు ఊహించని షాకిచ్చింది. ఆట నిర్దేశిత సమయంలో ఇరు జట్లూ తలా ఓ గోల్ (1-1)తో సమానంగా నిలువడంతో మ్యాచ్ పెనాల్టీ షూటౌట్‌కు దారితీసింది. షూటౌట్‌లో చైనా 2-0తో గెలిచి ఈ టోర్నీలో తొలిసారి ఫైనల్స్‌కు అర్హత సాధించింది.

కుస్తీ వీరుల రెజ్లింగ్ లీగ్

సాక్షి, అమన్, గీత ఆధ్వర్యంలో చాంపియన్‌షిప్

తమకు సంబంధం లేదన్న డబ్ల్యూఎఫ్ఐ

ఢిల్లీ: ఒలింపిక్స్‌లో భారత్‌కు పతకాలు అందించిన సాక్షి మాలిక్ (రియో), అమన్ సెహ్రావత్ (పారిస్)తో పాటు మాజీ వరల్డ్ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత గీతా ఫోగాట్ (వినేశ్ ఫోగాట్ సోదరి) కలిసి కొత్త రెజ్లింగ్ చాంపియన్‌షిప్ లీగ్‌ను ప్రారంభించనున్నారు. ఈ మేరకు సోమవారం సోషల్ మీడియా ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. యువ, వర్ధమాన రెజ్లర్లను ప్రోత్సహించేందుకు గాను తాము ముగ్గురం కలిసి రెజ్లింగ్ చాంపియన్స్ సూపర్ లీగ్ (డబ్ల్యూసీఎస్ఎల్)ను ప్రారంభించనున్నట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ.. 'సాక్షి, నేను చాలాకాలంగా ఈ లీగ్‌ను ప్రారంభించాలని అనుకుంటున్నాం. త్వరలోనే ఇది తుది రూపును సంతరించుకోనుంది. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)తో మేం ఇప్పటిదాకా అయితే సంప్రదింపులు జరుపలేదు. కానీ మాకు ప్రభుత్వంతో పాటు సమాఖ్య మద్దతు కావాలి. క్రీడాకారులే నిర్వహించబోతున్న తొలి లీగ్ మాదే కాబోతుంది. దీనిని మేం పూర్తిగా యువ రెజ్లర్ల కోసం ప్రారంభించబోతున్నాం. ఇందులోకి ఎవరైనా రావొచ్చు. మేం ఎవరినీ వద్దనం. రెజ్లర్లు కూడా ఎవరి బలవంతం లేకుండా ఈ లీగ్‌లో పాల్గొనవచ్చు' అని తెలిపింది. అయితే దీనిపై డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ సంజయ్ సింగ్ స్పందిస్తూ.. 'మేం దానిని ఆమోదించబోం. మేము మా రెజ్లింగ్ లీగ్‌ను పునరుద్ధరించే పనిలో ఉన్నాం. రెజ్లర్లు తమ సొంత లీగ్‌ను నిర్వహించుకునేందుకు మాకు ఎలాంటి అభ్యంతరమూ లేదు. వాళ్లు ఆటను ప్రమోట్ చేసుకోవచ్చు. కానీ దానితో మాకు సంబంధమూ లేదు' అని తెలపడం గమనార్హం.

ప్రాక్టీస్..ప్రాక్టీస్

చెమటోడ్చిన టీమ్‌ఇండియా క్రికెటర్లు

చెన్నై: బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు కోసం భారత క్రికెటర్లు ప్రాక్టీస్‌లో మునిగిపోయారు. చెన్నై చిదంబరం స్టేడియం వేదికగా ఈనెల 19 నుంచి ఇరు జట్ల మధ్య తొలి టెస్టుకు తెరలేవనుంది. ఇందుకోసం సోమవారం టీమ్‌ఇండియా క్రికెటర్లు నెట్స్‌లో తీవ్రంగా చెమటోడ్చారు. తొలుత యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ..బుమ్రా, అశ్విన్ బౌలింగ్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశారు. ఆ తర్వాత కెప్టెన్ రోహిత్‌శర్మ, శుభ్‌మన్ గిల్, సర్ఫరాజ్ వీరిని అనుసరించారు. జడేజా, పంత్, సిరాజ్‌కు లోకల్ బౌలర్లు బౌలింగ్ చేశారు. ఇటీవల పాకిస్థాన్‌తో జరిగిన టెస్టు సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి జోరుమీదున్న బంగ్లా జట్టును భారత్ సీరియస్‌గా తీసుకుంటున్నది. కొత్తగా ఎర్రమట్టితో తయారుచేసిన పిచ్‌పై ప్రత్యర్థికి సవాల్ విసరనుంది. చెన్నై పిచ్ సాధారణంగా స్పిన్‌కు అనుకూలించనున్న నేపథ్యంలో ముగ్గురు స్పిన్నర్లు, ఇద్దరు పేసర్లతో బరిలోకి దిగనుంది. ఇదిలా ఉంటే టీమ్‌ఇండియా క్రికెటర్లు గ్రూపులుగా విడిపోయి దిలీప్ ఆధ్వర్యంలో ఫీల్డింగ్ ప్రాక్టీస్ చేశారు. పాక్‌పై సిరీస్ విజయంతో ఆత్మవిశ్వాసంతో ఉన్న బంగ్లా..భారత్‌కు పోటీ నివ్వాలని చూస్తున్నది. బంగ్లా క్రికెటర్లు సోమవారం ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నారు.

భార్యపై హత్యాయత్నం

జింబాబ్వే మాజీ క్రికెటర్ అరెస్ట్

హరారే: కట్టుకున్న భార్యపై హత్యాయత్నానికి పాల్పడ్డందుకు గాను జింబాబ్వే మాజీ క్రికెటర్ తరిసాయ్ మసకందను పోలీసులు అరెస్టు చేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. రెండ్రోజుల క్రితం మసకంద భార్య టినో డివనషె మకునికెపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. డబ్బుల వ్యవహారంలో తలెత్తిన ఓ గొడవలో ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో అతడు వంటగదిలో ఉండే కత్తితో

మసకంద

ఆమెపై దాడికి దిగాడు. ఈ ఘటనలో ఆమె చేతులు, వీపు భాగంలో తీవ్ర గాయాలైనట్టు స్థానిక పోలీసులు తెలిపారు. మసకంద జింబాబ్వే తరపున 5 టెస్టులు, 16 వన్డేలు, 12 టీ20లు ఆడాడు.

బంగ్లా సిరీస్ రద్దు చేయండి

బీసీసీఐకి హిందూ జాగరణ సమితి డిమాండ్

ముంబై: స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరిగే క్రికెట్ సిరీస్‌ను వెంటనే రద్దు చేయాలని హిందూ జాగరణ సమితి..బీసీసీఐని డిమాండ్ చేసింది. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బీసీసీఐ నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఈ మేరకు సోమవారం హిందూ జాగరణ సమితి ప్రతినిధులు..బోర్డు స్పెషల్ ఎగ్జిక్యూటివ్ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ కాపీని ప్రధాని నరేంద్రమోదీతో పాటు విదేశాంగ మంత్రి జైశంకర్‌కు కూడా పంపిస్తామని ప్రతినిధులు పేర్కొన్నారు. భారత పర్యటనలో బంగ్లా టీమ్ రెండు టెస్టులు, మూడు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. మాజీ ప్రధాని షేక్ హసీన రాజీనామా తర్వాత బంగ్లాలో హిందువులపై ఊచకోత కొనసాగుతున్నది. మైనార్టీ హిందువులపై అమానుష రీతిలో దాడులు చేస్తూ ప్రాణాలు తీస్తున్న సంగతి తెలిసిందే. దీనికి నిరసనగా హిందూ జాగరణ సమితి నేతలు బీసీసీఐ వైఖరిని తప్పుబడుతున్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.